నిజాయితీగా ప్రవర్తించడం ద్వారా మనలో మంచి కేరక్టర్ రూపొందుతుంది. అదే మనల్ని పరమాత్మ దగ్గరకి తీసుకెళ్ళేది.''

## 80. సింప్లి సిట్టింగ్ స్వామి

ఓ గుడి పాలకవర్గ అధ్యక్షుడు ఆ గుడిలో ఎవరెవరు ఏఏ పనులు చేస్తున్నారో విచారించాడు. పూజారి, వాచ్‌మేన్, పనిమనిషి లాంటి అనేకమంది చేసే పని గుడికి అవసరం అనుకున్నాడు. కాని, దేవుడి ప్రసాదం తింటూ, గుళ్ళో బస చేసే 'సింప్లి సిట్టింగ్ స్వామి' అనే అతను మాత్రం ఏ పనీ చేయడం లేదని తెలుసుకుని అతన్ని పిలిపించి చెప్పాడు.

''నీవల్ల గుడికేం లాభం కలగడం లేదు. ఇక నీకు ప్రసాదం పెట్టం. వేరే ఎక్కడికైనా వెళ్ళు.''

''ఇదన్యాయం. నేను అందరికన్నా కష్టమైన పని చేస్తున్నాను.'' చెప్పాడు సన్యాసి.

''కష్టమైన పనా? నువ్వనలేం పనీ చేయక ఖాళీగా కూర్చుంటున్నావుగా? ''

''సరే. మీరో పూట ఏ పనీ చేయకుండా దైవ చింతనతో ఖాళీగా కూర్చోండి. అది తేలికని మీకనిపిస్తే, అప్పుడు మీరు చెప్పినట్లే చేయండి.''

ఆ అధ్యక్షుడు సరేనని, మర్నాడు ఉదయం ఇంట్లో ఏ పనీ చేయకుండా ఓ గదిలో కూర్చున్నాడు. గంటకి మించి అలా ఖాళీగా కూర్చోవడం ఆయన వల్ల కాలేదు. ప్రపంచంతో ప్రమేయం పెట్టుకోకుండా ఖాళీగా ఉండగలగడం ఎవరికీ సాధ్యం కాదని గ్రహించిన ఆ అధ్యక్షుడు, ప్రపంచం మీద కాక, తన మనసుని భగవంతుని మీద పెట్టగలిగిన 'సింప్లి సిట్టింగ్ స్వామి' చేసే పని ఎంతో కష్టమైనదని గ్రహించి అతన్ని గుళ్ళోనే ఉండమని కోరాడు.